నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గచ్చిబౌలి: కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్ల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లో రూ.2.07 కోట్లు, శేరిలింగంపల్లి డివిజన్‌లో రూ.2.3 కోట్లు, కొండాపూర్ డివిజన్‌లో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేయనున్నారు.

5 నుంచి సీసీఆర్టీలో సమ్మర్‌క్యాంపు

మే 15వ తేదీ వరకు .. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు శిక్షణ తరగతులు

మాదాపూర్: మాదాపూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్)లో ఇంద్రధనుస్సు –2025 పేరిట సమ్మర్ క్యాంపు మే 5వ తేదీ ప్రారంభం కానుంది. 5–10 తరగతుల విద్యార్థులకు అవకాశం. శిక్షణ తరగతులు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. పపెట్రి, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్, మూమెంట్ అండ్ మైమ్, క్లే మోడలింగ్, టై అండ్ డై, పేపర్ క్రాఫ్ట్ తదితరాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 8886333799, 9063357895 లలో సంప్రదించాలి. ప్రవేశ రుసుము రూ. 2వేలుగా నిర్ణయించారు.

27న నిధి ఆప్ కే నిఖత్ 2.0

పటాన్‌చెరు టౌన్: భవిష్య నిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న నిధి ఆప్ కే నిఖత్ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మూడు కేంద్రాల్లో శిబిరాలను ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌లో విర్కో బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శేరిలింగంపల్లి పరిధిలోని జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం ఎంవైకె లాటిక్రెట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ 3 కేంద్రాల్లో భవిష్యనిధి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

కూకట్‌పల్లిలో..

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వి.వి. డాంగ్లికర్ తెలిపారు. ఈనెల 28న ఉదయం 10 గంటలకు మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో, జీఎల్ గ్రూప్ కంపెనీలో, కెఎల్ఆర్ విజయ్‌నగర్, మేడ్చల్‌లో ఉంటుందని, ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.

ఏఐతో కచ్చితమైన నిర్ధారణ లభిస్తుంది

రాయదుర్గం: వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ నిర్ధారణ పద్ధతులు అత్యంత కచ్చితత్వాన్ని అందిస్తాయని స్మైలైన్ డెంటల్ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో స్మైలైన్ డెంటల్ ఆస్పత్రి మూడవ బ్రాంచ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఈఆర్ఈసీ సిస్టమ్ ద్వారా అదే రోజు క్రౌన్‌లను ఏర్పాటు చేయవచ్చన్నారు. లేజర్ డెంటిస్ట్రీ తక్కువ నొప్పితో స్వల్ప శస్త్రచికిత్సకు మార్గం సుగమం చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్మైలైన్ డెంటల్ ఆస్పత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సునీత, వైద్యులు కీర్తి, ప్రీతి, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు, నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధికి 24 లక్షల 16 వేల రూపాయల మంజూరు పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి ఆర్థిక భరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు సంజీవరెడ్డి, కోనేరు ప్రసాద్, ఎండి ఇబ్రహీం, మారెళ్ల శ్రీనివాస్, ధాత్రి గౌడ్, చంద్రారెడ్డి, చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, పురంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్ బస్తీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే గాంధీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని పాపిరెడ్డినగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రారెడ్డి తెలిపారు. బస్తీలోని బీ బ్లాక్, రోడ్డు నెంబర్ 1, 2లో భూగర్భ డ్రైనేజీ పెండింగ్ పనులు, సి బ్లాక్, రోడ్డు నెంబర్ 5లో మంచినీటి సమస్యలను పరిశీలించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

అమ్మకాలు అంతంతే ..
ఆర్థికపుష్టి ఎలా..?

సందర్శకులు, కొనుగోలుదారులు వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలంటున్న మహిళా సంఘాలు

ఇదీ ఇందిరా మహిళాశక్తి బజార్ పరిస్థితి..!



మాదాపూర్‌లోని ఇందిరా మహిళాశక్తి బజార్ ప్రధాన ద్వారం





మాదాపూర్: ఇందిరా మహిళాశక్తి బజార్‌లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. పూర్తిస్థాయిలో పనులు పూర్తి కాకుండానే మహిళలకు స్టాల్స్‌ను కేటాయించారు. దీంతో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని పేర్కొంటున్నారు. ఇప్పుడిప్పుడే సందర్శకులను ఆకర్షించేందుకు గోడలపై పెయింటింగ్స్, వాటర్ ఫౌంటేన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులోకి రాకపోవడంతో అమ్మకాలు మందగించాయి. ఐటీ నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి బజార్‌లో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులతో స్టాల్స్ నిర్వహిస్తున్నారు. కానీ అమ్మకాలు మాత్రం ఆశించిన మేర జరగడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టాల్స్‌లో అగరబత్తీలు, ఉలెన్ ఉత్పత్తులు, చీరలు, జ్యూట్‌బ్యాగ్స్, ఇత్తడి, చెక్క





స్టాల్స్‌లో ఆకట్టుకుంటున్న ఉత్పత్తులు

వస్తువులు అందుబాటులో ఉంచారు. అలాగే చిరుధాన్యాలు, పిండి వంటలు, సాంప్రదాయ దుస్తులు సందర్శకులకు అందుబాటులో ఉంచారు. కేవలం శని, ఆది వారాలలో మాత్రమే అమ్మకాలు జరుగుతున్నాయన్నారు.అమ్మకాలు పెరగాలంటే ప్రచారంతో బాటు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని నిర్వాహకులు అభిప్రాయపడుతున్నారు.



కనువిందు.. నృత్య ప్రదర్శనలు



మాదాపూర్: శిల్పారామంలో శుక్రవారం పద్మావతి ఆర్ట్స్ అకాడమీ, సూత్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువులు క్రాంతి కిరణ్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో వినాయకకౌతం, పుష్పాంజలి, హిమగిరి తనయే, జతిస్వరం, మూషికవాహన, రామాయణశబ్దం, దశావతారం తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు సహస్ర, లక్ష్మిఅమూల్య, అదితి, దేవంశీ, చర్విత, పర్ణిక, ప్రద్యుతి, వణ్మయి, వీక్షిత్, వినమ్ర, విశాఖ, ఆరాధ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేవీఎస్ హ్యాండ్‌బాల్ టోర్నీ



రీజనల్ స్థాయి హ్యాండ్‌బాల్ బాలికల అండర్–17 జట్టు

రాయదుర్గం: కేంద్రీయ విద్యాలయ సమితి రీజనల్ స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. కేంద్రీయవిద్యాలయ గచ్చిబౌలి ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్రీయ విద్యాలయ గచ్చిబౌలి ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ అండర్–17 బాలికల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయలో చదువుతోపాటు క్రీడలు, సేవా రంగాలలో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. పోటీలలో విజేతగా కేంద్రీయ విద్యాలయ గోల్కొండ జట్టు, రన్నరప్‌గా కేంద్రీయ విద్యాలయ పికెట్ జట్టు, మూడవ స్థానాన్ని కేంద్రీయ విద్యాలయ తిరుమలగిరి నిలిచింది. మొదటి మూడు స్థానాలలో నిలిచిన జట్లకు మెడల్స్, సర్టిఫికెట్లను ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ అందించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కోచ్, ఫిజికల్ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

1200 గ్రాముల గంజాయి పట్టివేత

గచ్చిబౌలి: ఓ వ్యక్తి నుంచి 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాంకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి ప్రంజిత బైష్య(30) రాయదుర్గంలోని మధురానగర్‌లో నివాసం ఉంటున్నాను. కొద్ది రోజుల క్రితం అస్సాం వెళ్లిన అతను గంజాయి తెచ్చాడు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రాయదుర్గంలోని మల్కంచెరువు వద్ద స్కూటీతో నిలబడి ఉన్న ప్రంజిత్ బైష్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద బ్యాగులో ఉన్న 1200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శిక్షణా శిబిరంను సద్వినియోగం చేసుకోవాలి

ఎంఈఓ నాగేశ్వర్ నాయక్



పటాన్‌చెరు టౌన్: తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి శిక్షణ శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంగీతం, చిత్రలేఖనం, వ్యక్తిత్వ వికాసం, కథలు, యోగా తదితరాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తారన్నారు.

ప్రణాళికాబద్ధంగా పటాన్‌చెరు డివిజన్ అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఐదు కోట్ల 40 లక్షలతో.. అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్‌లో ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్, సీతారామయ్య కాలనీ, గోకుల్‌నగర్, తదితర కాలనీలలో ఐదు కోట్ల 40 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



28న భూ భారతి చట్టంపై అవగాహన

శంషాబాద్ రూరల్: భూ భారతి చట్టంపై శంషాబాద్ మండల పరిధిలోని రైతులకు ఈనెల 28వ తేదీన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారులు తెలిపారు. కవేలిగూడ చౌరస్తాలోని ఎంఎం గార్డెన్‌లో సాయంత్రం 4 గంటలకు అవగాహన కార్యక్రమం ఉంటుందన్నారు. భూమిపై హక్కులు, రిజిస్ట్రేషన్ సేవలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బస్సులను ఆపాలని వినతి



ఆల్విన్‌కాలనీ: సుమిత్రనగర్, రాందేవ్ బస్టాప్ వద్ద బస్సులు ఆగడం లేదని, దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డిపో మేనేజర్‌కు ఎమ్మెల్యే గాంధీ పంపిన వినతిపత్రాన్ని అందజేశారు. బస్సులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వి.తాండవకృష్ణ, జి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

పందెన్‌వాగుపై కప్పు నిర్మించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ట్రైల్స్ విల్లావాసులు

మణికొండ: తమ విల్లాల పక్క నుంచి వెళ్తున్న పందెన్‌వాగు ఓపెన్‌గా ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని, దానిపై కప్పు నిర్మించాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ట్రైల్స్ విల్లాలవాసులు కోరారు. మాజీ కౌన్సిలర్ కే.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వారు శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరించారు. ఈ మేరకు ప్రకాశ్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఫోన్‌లో మణికొండ మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌తో మాట్లాడారు. పందెన్‌వాగుపై కప్పు నిర్మించేందుకు నివేదిక రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నేత శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన



కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఎస్‌టీపీ ప్లాంట్ పైపులైన్ పనులను శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ ఫేజు, ఇందు అపార్టుమెంట్ పరిసరాల్లో జరుగుతున్న ఎస్‌టీపీ ప్లాంట్ పైపులైన్ పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చందానగర్: నల్లగండ్ల సెక్షన్ పరిధిలోని గోపన్‌పల్లి, నల్లగండ్ల సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటనారాయ రెడ్డి పేర్కొన్నారు.

- సాయిరాంనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు సాయిరాంనగర్ కాలనీ, డైమండ్ హైట్స్ కాలనీ, త్రిషలా అపార్ట్‌మెంట్స్, కంచ గచ్చిబౌలి ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- ఎన్టీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఎన్టీఆర్ నగర్, సోఫా కాలనీ ప్రాంతాలలో..
- ఎపిస్టిమో గ్లోబల్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఎపిస్టిమో స్కూల్, తెల్లాపూర్ రోడ్డు ఏరియాలలో..

వేమనకాలనీ సెక్షన్‌లో...

వేమన కాలనీ, మదీనాగూడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో

- సీబీఆర్ ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు సీబీఆర్ ఎస్టేట్స్, క్రోమా బిల్డింగ్ వెనకాల, శ్రీ దుర్గ హోమ్స్, ఆంధ్రాబ్యాంక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.
- ఎస్టీపీ ప్లాంట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి 10.00 వరకు ఎస్టీపీ ప్లాంట్, భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్, శంకర్‌నగర్ ప్రాంతాలలో..
- సురక్షా ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి 11.00 వరకు విద్యానగర్, సురక్షా ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెటీ సర్వీస్ ప్రాంతాలలో..
- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్, గ్రీన్ హిల్స్ అపార్ట్‌మెంట్, కెఎస్ఆర్ ఏరియా అయ్యప్ప స్వామి టెంపుల్ నుంచి అపర్ణ రోడ్డు, ఇక్రిశాట్ కాలనీ ఏరియాలలో..
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి 11.00 వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో..
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 8.00 గంటల నుంచి 11.00 వరకు భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్‌నగర్ రోడ్డు నెంబర్ 4,5,6 కైలాష్‌నగర్ శ్రీదేవి థియేటర్, ఎస్వీఎస్ ఇన్ఫ్రా లిమిటెడ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

చందానగర్ సెక్షన్‌లో..

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో నూతన విద్యుత్ సర్వీస్‌ల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.00 గంటల నుంచి 9.30 వరకు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, బీహెచ్ఈఎల్ హెచ్‌ఐజీ, ఉషోదయ ఎన్‌క్లేవ్ ఏరియాలలో..
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 9.30 గంటల నుంచి 10.00 వరకు సీఎం తోట, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, నార్నె ఎస్టేట్స్ ప్రాంతాలలో ..

హఫీజ్‌పేట్ సెక్షన్‌లో..

హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని.. 11 కేవీ ఫీడర్ల పరిధిలో ..ఉదయం 9.00 గంటల నుంచి 10.00 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- ఆదిత్యనగర్ ఫీడర్ పరిధిలో.. ఆదిత్యనగర్, ఎస్‌సీబి నగర్, కృష్ణ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్‌హాల్ మెయిన్ రోడ్డు ఏరియాలలో..
- విశ్వంభర ఫీడర్ పరిధిలో.. విశ్వంభర ఎన్‌క్లేవ్, శిల్పా ఎవెన్యూ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో.. శనివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు స్వర్ణపురి కాలనీ రోడ్డు నంబర్ –14 నుండి 22 వరకు, గ్రేటర్ ఇన్ఫ్రా ఏరియాల్లో..

- అలాగే 9.30 గంటల నుండి 10 గంటల వరకు.. కృషినగర్, స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, రాఘవేంద్ర పాంచజన్య అపార్ట్‌మెంట్, జేపీనగర్, నాగార్జున ఎన్‌క్లేవ్, డీకే ఎన్‌క్లేవ్
- అదేవిధంగా 3.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు దీప్తిశ్రీనగర్, 4 గంటల నుండి 4.30 గంటల వరకు స్వర్ణపురి రోడ్డు నంబర్–1 నుండి 13 వరకు, జనప్రియ వెస్ట్‌సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

దోమతెరలు వాడాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

చందానగర్: దోమ కాటు వలన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడు వాపు వ్యాధులు వస్తాయని, ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా చూడాలని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. వరల్డ్ మలేరియా డేను పురస్కరించుకొని శుక్రవారం శేరిలింగంపల్లిలోని యూపీహెచ్‌సీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా.వెంకటేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, దోమలు ఉత్పత్తి చెందకుండా జాగ్రత్తలతో పాటు అవి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ అధికారులకు సూచించారు. ప్రజలు దోమ తెరలు వాడాలన్నారు. జ్వరం వచ్చిన రోగులు తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం మలేరియాపై అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గుల్‌మొహర్ పార్కు, లింగంపల్లి రైల్వేస్టేషన్ వరకు నిర్వహించారు. వాల్ పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటి డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాకేష్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమదీపిక, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వామి, ప్రేమ్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి



నడిగడ్డతండాలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్: డివిజన్ పరిధిలోని నడిగడ్డతండాలో ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మియాపూర్ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు నర్సింహ ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి ఇస్లావత్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ... అమర వీరుల ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మైదంశెటి రమేష్, దానయ్య, లక్ష్మీ, గౌసియాబేగం, ఖైరున్నీసాబేగం, మనీష, సంధ్య తదితరులున్నారు.

ఉగ్రదాడి.. నిరసన ప్రదర్శన



మధురానగర్‌లో.. ఎమ్మెల్సీ ప్రభాకర్, ఎస్‌కేవై ప్రతినిధులు

గచ్చిబౌలి: పహల్గాంలో ఉగ్రవాదుల చర్యను ఖండిస్తూ అంజయ్యనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పర శేఖర్ సగర మాట్లాడుతూ దేశ ప్రజలు సమైక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సగర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మోడల రవి సగర, ఉపాధ్యక్షులు ఆంజనేయులు సగర, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్, గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షులు ఎర్రంశెట్టి సీతారాం, నాయకులు గడ్డపార రవీందర్, రవి కుమార్, చంద్రకళ, రాధ, మన్యంకొండ సగర తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో..

చందానగర్: జమ్ముకశ్మీర్‌లోని పహల్గావ్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం నల్లగండ్ల అపర్ణ గ్రాండే సముదాయంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కమ్యూనిటీ వాసులు భారీగా తరలి వచ్చి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు, సీనియర్ సిటిజన్లు ర్యాలీ నిర్వహించారు.

మధురానగర్‌లో..

రాయదుర్గం: మధురానగర్‌లో శ్రీకృష్ణయూత్ అసోసియేషన్, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రభాకర్ మాట్లాడుతూ అమాయక ప్రజలను చంపడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ యూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



నల్లగండ్లలోని అపర్ణ గ్రాండేలో..



సగర సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ